## కేసీఆర్‌ను కలిసిన పువ్వాడ

### ప్రజల తరఫున ప్రభుత్వంపై పోరాడాలని బీఆర్ఎస్ అధినేత పిలుపు



ఖమ్మం, ఫిబ్రవరి 13: బీఆర్ఎస్ అధినేత, మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్‌ను మాజీ మంత్రి పువ్వాడ అజయ్‌కుమార్ ఎర్రవల్లిలో గురువారం మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా రాబోయే రోజుల్లో పార్టీ ఆధ్వర్యంలో చేపట్టాల్సిన కార్యక్రమాలు, కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజలను మోసం చేసేందుకు చేపడుతున్న పథకాలపైనా చర్చించారు. రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజలను మభ్యపెట్టి మోసంతో అధికారంలోకి వచ్చిందని, బీఆర్ఎస్ ప్రభుత్వం ప్రవేశపెట్టి అమలు చేసిన పథకాలను నీరుగార్చి కాలం గడుపుతున్నారని, ప్రభుత్వంపై ప్రజల తరఫున పోరాడాలని కేసీఆర్ పిలుపునిచ్చారు. ఖమ్మం నియోజకవర్గ నాయకులు, కార్యకర్తలకు ఎల్లవేళలా అందుబాటులో ఉంటానని మంత్రి పువ్వాడ పేర్కొన్నారు.

## రేపు ఖమ్మానికి ఎమ్మెల్సీ కవిత?

### బీసీ రిజర్వేషన్లపై రౌండ్‌టేబుల్ సమావేశానికి హాజరు




ఖమ్మం, ఫిబ్రవరి 13: ఎమ్మెల్సీ, తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత శనివారం ఖమ్మం రానున్నట్లు తెలిసింది. విశ్వసనీయ సమాచారం ప్రకారం.. 42 శాతం రిజర్వేషన్ల అంశంపై కాంగ్రెస్ ప్రభుత్వం బీసీలను మోసం చేసిన నేపథ్యంలో బీసీ సంఘాల నేతలు, తెలంగాణ జాగృతి సభ్యులు, తెలంగాణ ఉద్యమకారులతో తెలంగాణ జాగృతి ఆధ్వర్యంలో ఖమ్మంలో శనివారం రౌండ్‌టేబుల్ సమావేశం నిర్వహించనున్నారు. అయితే ఈ సమావేశానికి కవిత హాజరుకానున్నారు. ఖమ్మం బైపాస్ రోడ్డులోని సప్తపది ఫంక్షన్ హాల్లో శనివారం ఉదయం 11 గంటలకు ప్రారంభమయ్యే ఈ సభలో ఆమె ప్రసంగిస్తారు. రాజ్యసభ సభ్యుడు వద్దిరాజు రవిచంద్ర ఇంట్లో మధ్యాహ్నం భోజనం చేస్తారు. బీఆర్ఎస్ నేత, ఎస్‌బీఐటీ కళాశాల అధినేత ఆర్జేసీ కృష్ణ ఇంట్లో సాయంత్రం తేనీటి విందు స్వీకరిస్తారు. కవితకు స్వాగతం పలికేందుకు బీఆర్ఎస్ నాయకులు, జాగృతి బాధ్యులు ఏర్పాట్లు చేస్తున్నారు.

## లక్ష్యం కొండంత.. గెలలు గోరంత

- ఏడేళ్లుగా లక్ష్యం చేరని పామాయిల్ గెలల క్రషింగ్
- కొత్త ఫ్యాక్టరీలకు గెలల కొరత?
- 2024-25 నాటికి 124 టీపీహెచ్ మాత్రమే..

దమ్మపేట రూరల్, ఫిబ్రవరి 13: ఏడేళ్లుగా పామాయిల్ గెలల క్రషింగ్ లక్ష్యం చేరడం లేదు. ప్రస్తుతం రాష్ట్రంలోని భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలో ఉన్న అశ్వారావుపేట, అప్పారావుపేట ఫ్యాక్టరీల సామర్థ్యానికి సరిపడా పామాయిల్ గెలల ఉత్పత్తి జరగడం లేదు. రాష్ట్రంలో తెలంగాణ ఆయిల్‌ఫెడ్‌కు ఎనిమిది జిల్లాల్లో పామాయిల్ ఫ్యాక్టరీ జోన్‌లు ఉన్నాయి. వీటిలో 2021–22 ఆర్థిక సంవత్సరం వరకు 56,038 ఎకరాల్లో పామాయిల్ తోటలు సాగవుతున్నట్లు ఆయిల్‌ఫెడ్ లెక్కల ప్రకారం తెలుస్తోంది. 7–8 సంవత్సరాల వయసు పైబడిన తోటల నుంచి మాత్రమే పూర్తిస్థాయిలో పామాయిల్ గెలల సగటు దిగుబడి 8–10 మెట్రిక్ టన్నుల గెలలు వస్తుందని అధికారిక అంచనా. దీని ప్రకారం 39,400 ఎకరాల నుంచి సగటు దిగుబడి వస్తున్నది. మిగిలిన 16,638 ఎకరాల నుంచి సగటు దిగుబడి 3–5 టన్నుల సగటు దిగుబడి వస్తున్నది. అశ్వారావుపేట, అప్పారావుపేట ఫ్యాక్టరీల్లో 2018–19 ఆయిల్ ఇయర్ నుంచి ఇటీవల ముగిసిన 2023–24 ఆయిల్ ఇయర్ వరకు లక్ష్యం చేరుకోలేదు. ముగిసిన ఆయిల్ ఇయర్‌లో ఉమ్మడి ఖమ్మం జిల్లా మినహాయిస్తే రాష్ట్రంలోని మిగిలిన ప్రైవేటు కంపెనీల జోన్‌లతో సహా వచ్చిన గెలలు సుమారు 1,580 టన్నులు మాత్రమే. ఇది ఈ ఆయిల్ ఇయర్‌లో 6 వేల మెట్రిక్ టన్నులు మించకపోవచ్చనేది అంచనా. ఇప్పటికే ఖమ్మం జిల్లాలో సుమారు 10 వేల ఎకరాల్లో పామాయిల్ తోటలు కలిగిన ప్రైవేటు కంపెనీ ఇప్పటివరకు ఫ్యాక్టరీ నిర్మించలేదు. ఈ కంపెనీ తప్పని పరిస్థితుల్లో ఫ్యాక్టరీ నిర్మించినా 5 టీపీహెచ్‌తో మాత్రమే నిర్మించనుంది. ప్రాసెసింగ్ ప్లాంట్ల అవసరమని ఆయిల్‌ఫెడ్ అంచనా ప్రకారం 124 టీపీహెచ్ ప్రాసెసింగ్ ప్లాంటు అవసరం కాగా.. లక్ష్యానికి మించి 150 టీపీహెచ్ సామర్థ్యం కలిగిన ఫ్యాక్టరీలు అందుబాటులోకి వచ్చాయి. ప్రభుత్వరంగ సంస్థ అయిన ఆయిల్‌ఫెడ్ మాత్రం వందల కోట్లు అప్పు చేసి మరీ అవసరం లేని అధిక సామర్థ్యంతో కొత్త ప్లాంట్లు నిర్మిస్తోందని రైతులు ఆరోపిస్తున్నారు.



పామాయిల్ తోట

| ఆయిల్ ఇయర్ | లక్ష్యం మెట్రిక్ టన్నుల్లో | వచ్చిన గెలలు మెట్రిక్ టన్నుల్లో |
|---|---|---|
| 2018-19 | 2.3 | 2.00 |
| 2019-20 | 2.3 | 1.98 |
| 2020-21 | 2.5 | 2.29 |
| 2021-22 | 2.9 | 2.64 |
| 2022-23 | 2.9 | 2.7 |
| 2023-24 | 2.9 | 2.27 |
| 2024-25 | 3.00 | 36 వేలు |

(జనవరి 2025) వరకు

### 150 టీపీహెచ్‌కు చేరుకోనున్న క్రషింగ్ సామర్థ్యం..

ఇప్పటికే అశ్వారావుపేటలో 30 టీపీహెచ్(టన్ను పర్ హవర్), అప్పారావుపేటలో 90 టీపీహెచ్ సామర్థ్యంతో పామాయిల్ ప్రాసెసింగ్ ప్లాంట్లు తెలంగాణ ఆయిల్‌ఫెడ్ యాజమాన్యంలో పని చేస్తున్నాయి. వీటికి త్వరలో సిద్దిపేట జిల్లాలో నిర్మాణం పూర్తవుతున్న 30 టీపీహెచ్ ఫ్యాక్టరీ తోడై 150 టీపీహెచ్ సామర్థ్యానికి చేరుకోనుంది. సాధారణంగా రోజులో సగటున 20 గంటలు ప్రాసెసింగ్ ప్లాంట్(ఫ్యాక్టరీ) పనిచేస్తుంది. ఈ సామర్థ్యం ప్రకారం రోజుకు 3 వేల మెట్రిక్ టన్నుల పామాయిల్ గెలలను ప్రాసెసింగ్ చేసే సామర్థ్యం వస్తోంది. ఇప్పుడు పనిచేస్తున్న అశ్వారావుపేట ఫ్యాక్టరీ సుమారు 6 నెలలు, అప్పారావుపేట ఫ్యాక్టరీ 4–5 నెలలు మెయింటెనెన్స్ పేరుతో మూతవేస్తున్నారు. సిద్దిపేటలో నిర్మిస్తున్న ఫ్యాక్టరీ 6 నెలలకు మించి మూతవేయాల్సిన పరిస్థితి తప్పదు. లక్ష్యానికి అనుగుణంగా పామాయిల్ సాగు మందకొడిగా సాగుతోంది. దీని ప్రకారం కొత్త ఫ్యాక్టరీల ఆవశ్యకత రాబోయే ఐదారేళ్ల వరకు ఆయిల్‌ఫెడ్‌కు అవసరం లేదని నిపుణులు చెబుతున్నారు.



పామాయిల్ గెలలు (ఫైల్)



అప్పారావుపేటలోని పామాయిల్ ఫ్యాక్టరీ

## వృక్షార్చనను విజయవంతం చేయండి

### పోస్టర్ ఆవిష్కరించిన బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు రేగా కాంతారావు

భద్రాచలం, ఫిబ్రవరి 13: ముఖ్యమంత్రిగా రాష్ట్రాన్ని పదేళ్లపాటు అభివృద్ధి పథంలో నడిపించిన కేసీఆర్ జన్మదినం సందర్భంగా ఈ నెల 17న రాష్ట్రవ్యాప్తంగా హరితసేన ఆధ్వర్యంలో నిర్వహించే వృక్షార్చన కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని బీఆర్ఎస్ భద్రాద్రి జిల్లా అధ్యక్షుడు, పినపాక మాజీ ఎమ్మెల్యే రేగా కాంతారావు పిలుపునిచ్చారు. భద్రాచలంలోని అంబేద్కర్ సెంటర్‌లో వృక్షార్చన వాల్ పోస్టర్లను బీఆర్ఎస్ నాయకులతో కలిసి ఆయన గురువారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా రేగా మాట్లాడుతూ కేసీఆర్ జన్మదినం నాడు పండుగ వాతావరణంలో ప్రతీ నాయకుడు, కార్యకర్త, అభిమానులు మూడు మొక్కలు నాటి రాష్ట్రాన్ని హరితవనంగా మార్చాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమాల్లో పార్టీ శ్రేణులు అధిక సంఖ్యలో పాల్గొని మొక్కలు విరివిగా నాటాలని కోరారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ మండల కన్వీనర్ ఆకోజు సునీల్‌కుమార్, కో కన్వీనర్ రేపాక పూర్ణచందర్ రావు, హరిత సేన నియోజకవర్గ నాయకుడు కీసర యువరాజు, నాయకులు గుంజా ఏడుకొండలు, అయినాల రామకృష్ణ, ఇమంది నాగేశ్వరరావు, రోహిత్‌పాషా, లంకపల్లి విశ్వనాథ్ పాల్గొన్నారు.



వృక్షార్చన పోస్టర్ విడుదల చేస్తున్న రేగా కాంతారావు

## సీఎం సారూ.. మా స్కూటీలు ఏమయ్యాయి?

- ఖమ్మంలో కళాశాల విద్యార్థినుల పోస్టుకార్డు ఉద్యమం
- కాంగ్రెస్ ప్రభుత్వ స్కూటీల గ్యారెంటీపై నిరసన

ఖమ్మం/ ఖమ్మం అర్బన్, ఫిబ్రవరి 13: 'సీఎం సారూ.. మా స్కూటీలు ఏమయ్యాయి?' అంటూ ఖమ్మంలోని డిగ్రీ కళాశాలల విద్యార్థినులు సీఎం రేవంత్‌రెడ్డిని ప్రశ్నించారు. ప్రభుత్వం ఏర్పడి 15 నెలలు పూర్తయినా స్కూటీల హామీని అమలు చేయకపోవడంపై ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ మేరకు ఖమ్మం జిల్లా కేంద్రంలో గురువారం పోస్టుకార్డు ఉద్యమం ద్వారా నిరసన వ్యక్తం చేశారు. 'ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి గారూ.. 18 ఏళ్లు పైబడిన యువతులకు ఉచితంగా స్కూటీలు ఇస్తామంటూ చేసిన వాగ్దానం ఏమైంది సారూ?' అంటూ ప్రశ్నించారు. 'మీరిచ్చిన స్కూటీల హామీని మర్చిపోయారేమోనని అనుకుంటున్నాం. అందుకే దానిని గుర్తుచేస్తూ పోస్టు కార్డులు పంపుతున్నాం సార్..' అంటూ సీఎం రేవంత్‌రెడ్డికి రాసిన ఆ పోస్టుకార్డుల్లో పేర్కొన్నారు.



స్కూటీలు ఏమయ్యాయంటూ సీఎంకు రాసిన పోస్టుకార్డులను చూపిస్తున్న ఖమ్మం డిగ్రీ కళాశాలల విద్యార్థినులు

### హామీని గుర్తు చేస్తూ..

ఖమ్మంలోని ఎస్ఆర్అండ్‌బీజీఎన్ఆర్ కళాశాల విద్యార్థినులు, జిల్లా కేంద్ర గ్రంథాలయంలో పోటీ పరీక్షలకు సిద్ధమవుతున్న విద్యార్థినులు, ఇతర ప్రైవేటు డిగ్రీ కళాశాలల విద్యార్థులు కలిసి ఖమ్మం నగరంలో గురువారం నిరసన కార్యక్రమం చేపట్టారు. 'ముఖ్యమంత్రి గారూ.. మేం ఖమ్మంలోని డిగ్రీ విద్యార్థినులం. ఖమ్మం నగరంతోపాటు చుట్టుపక్కల గ్రామాల నుంచి డిగ్రీ చదువుకునేందుకు ప్రతి రోజూ కళాశాలలకు వచ్చి వెళ్తున్నాం. ఇలా ప్రతిరోజూ బస్సుల్లోనూ, ఆటోల్లోనూ రాకపోకలు సాగించే క్రమంలో అనేక ఇబ్బందులు పడుతున్నాం. మీరు ఉచిత బస్సు సౌకర్యం కల్పించినప్పటికీ మా మార్గాల్లో బస్సులు ప్రయాణించడం లేదు. బస్సు సౌకర్యం ఉన్న మార్గాల్లో మా కళాశాలల సమయాలకు అనుగుణంగా అవి రావడం లేదు. ఒకవేళ వేచి చూసినా బస్సులన్నీ నిండిపోయి ఉంటున్నాయి. కనీసం ఎక్కేందుకు కూడా చోటు ఉండడం లేదు. ఇక ఆటోల్లో వెళ్లి వచ్చేంత ఆర్థిక వెసులుబాటు కూడా మాకు లేదు. మీరిచ్చిన స్కూటీల హామీపై మేం ఎంతో నమ్మకంతో, ఆశతో ఉన్నాము. మీరు స్కూటీలిస్తే సమయానుకూలంగా కళాశాలలకు వెళ్లి రావొచ్చని, మా భవిష్యత్తుకు పునాదులు వేసుకోవచ్చని కలలుగన్నాం. కానీ.. 15 నెలలు గడిచినా మీరు స్కూటీలు ఇవ్వడం లేదు. ఇంతలో మా ఒక ఏడాది విద్యాభ్యాసం కూడా ముగిసింది. ఇప్పుడు మరో ఏడాది తరగతులకు వెళ్తున్నాం. ఇప్పటికైనా మా ఇబ్బందులను గమనించండి. మీ స్కూటీల హామీని అమలు చేయండి. మాకు బంగారు భవిష్యత్తును అందించండి' అంటూ పోస్టు కార్డులు రాశారు. వాటిని పోస్టుబాక్సుల్లో వేశారు. ఈ సందర్భంగా విద్యార్థినులు మాట్లాడుతూ.. 15 నెలలుగా స్కూటీల కోసం ఎదురుచూస్తున్నామని, స్కూటీల హామీని నిలబెట్టుకోవాలని కోరుతున్నామని డిమాండ్ చేశారు.

## నగరవాసులకు మెరుగైన సేవలు అందించాలి

### ఖమ్మం మున్సిపల్ కార్పొరేషన్ సమీక్షలో కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్

ఖమ్మం, ఫిబ్రవరి 13 : సమర్థవంతమైన పరిపాలనతోపాటు నగరవాసులకు మెరుగైన సేవలు అందించాలని కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్ ఆదేశించారు. గురువారం ఖమ్మం మున్సిపల్ కార్పొరేషన్ కార్యకలాపాలపై కార్పొరేషన్ సమావేశ మందిరంలో కలెక్టర్.. అదనపు కలెక్టర్, ఇన్‌చార్జి మున్సిపల్ కమిషనర్ డాక్టర్ శ్రీజ, అధికారులతో కలిసి సమీక్షించారు. పారిశుధ్య నిర్వహణ, చెత్త సేకరణ, ఖాళీ స్థలాలు, నీటి సరఫరా ప్రణాళిక, టౌన్ ప్లానింగ్, పన్ను వసూలు, ఫిర్యాదుల పరిష్కారం వంటి పలు అంశాలపై చర్చించిన కలెక్టర్ అధికారులకు పలు సూచనలు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కార్పొరేషన్ పరిధిలో చెత్త పేరుకుపోతున్న 1,248 ఖాళీ స్థలాలను గుర్తించామని, వీటిలో ఎన్ని శుభ్రం చేశామో వాస్తవిక వివరాలతో నివేదిక అందించాలన్నారు. ప్రైవేటు స్థలాలకు ఫెన్సింగ్, ఇతర ఏర్పాట్లు చేసుకోవాల్సిందిగా స్థల యజమానులకు నోటీసులు జారీ చేయాలని, నిర్లక్ష్యం వహిస్తే చట్ట ప్రకారం చర్యలు తీసుకోవాలని సూచించారు. కార్పొరేషన్ పరిధిలో ప్రతిరోజూ చెత్త సేకరించి డంపింగ్ యార్డుకు తరలించేలా క్షేత్రస్థాయి పరిశీలన చేసి 15 రోజుల్లో డివిజన్లవారీగా ప్రణాళికలు సమర్పించాలన్నారు. జిల్లా ఆసుపత్రి పరిసర ప్రాంతాల్లో పారిశుధ్య నిర్వహణ కోసం ప్రత్యేక అధికారి ఆధ్వర్యంలో బృందాన్ని ఏర్పాటు చేయాలన్నారు. రాబోయే వేసవి కాలంలో గత అనుభవాలను దృష్టిలో ఉంచుకొని తాగునీటి సరఫరాకు ఇబ్బందులు కలగకుండా ముందు జాగ్రత్త చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. అదనపు కలెక్టర్, ఇన్‌చార్జి మున్సిపల్ కమిషనర్ డాక్టర్ శ్రీజ మాట్లాడుతూ గత సమీక్షలో తీసుకున్న నిర్ణయాల మేరకు ప్రతి డివిజన్‌కు పారిశుధ్య ప్రణాళిక, కార్పొరేషన్‌లో కంట్రోల్ రూమ్ ఏర్పాటు చేశామని తెలిపారు. ఫిబ్రవరి నెలాఖరు నాటికి షాపింగ్ మాల్స్‌లో ర్యాంప్ ఏర్పాటు పూర్తి కావాలన్నారు. సమావేశంలో అసిస్టెంట్ కమిషనర్ షఫీవుల్లా, ఎస్ఈ వి.రంజిత్, ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ కృష్ణాలాల్, ఏసీపీ వసుంధర, ఉద్యానవన శాఖ అధికారి రాధిక, శానిటరీ సూపర్‌వైజర్ సాంబయ్య, రెవెన్యూ అధికారి జి.శ్రీనివాసరావు, ఇన్‌చార్జి డీసీపీ రాజ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఖమ్మం కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్

## పారదర్శకంగా ఎన్నికల నిర్వహణ: భద్రాద్రి కలెక్టర్

భద్రాద్రి కొత్తగూడెం, ఫిబ్రవరి 13 (నమస్తే తెలంగాణ): పంచాయతీ ఎన్నికలు పారదర్శకంగా నిర్వహించాలని కలెక్టర్, ఎన్నికల అధికారి జితేశ్ వి పాటిల్ సూచించారు. కొత్తగూడెంలోని ఆనంద ఖని జడ్పీ ఉన్నత పాఠశాల ఆవరణలో పంచాయతీ ఎన్నికల స్టేజ్–1 రిటర్నింగ్ అధికారులు, అసిస్టెంట్ రిటర్నింగ్ అధికారుల శిక్షణా తరగతులను గురువారం ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ శిక్షణలో అన్ని అంశాలపై అవగాహన పెంచుకొని సందేహాలకు తావు లేకుండా పారదర్శకంగా ఎన్నికలు నిర్వహించాలన్నారు. డీపీవో చంద్రమౌళి మాట్లాడుతూ మండల స్థాయిలో పీవోలు, ఏపీవోలకు త్వరలోనే శిక్షణ ఇస్తామని, మండల స్థాయి అధికారులందరూ సంబంధిత శిక్షణను పూర్తిస్థాయిలో విజయవంతమయ్యే విధంగా చర్యలు చేపట్టాలన్నారు. జిల్లా పంచాయతీ ఎన్నికల ట్రైనింగ్ నోడల్ అధికారి నగిని సతీశ్‌కుమార్ మాట్లాడుతూ కొత్తగూడెం, భద్రాచలం డివిజన్లలో ఉన్న 409 మంది రిటర్నింగ్, అసిస్టెంట్ రిటర్నింగ్ అధికారులకు ఒక్కరోజు శిక్షణ ఉంటుందని తెలిపారు. కార్యక్రమంలో డీఎల్‌పీవో సుధీర్‌కుమార్, రమణ, విద్యాశాఖ కో ఆర్డినేటర్లు సైదులు, నాగరాజశేఖర్, మాస్టర్ ట్రైనీలు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న కలెక్టర్ జితేశ్ వి పాటిల్

## కేఓసీ ప్రభావిత ప్రాంత ప్రజల నిరసన

### బొగ్గు లారీలు, టిప్పర్ల దుమ్మూధూళితో అవస్థలు పడుతున్నామని ఆవేదన

### సింగరేణి పట్టించుకోవడం లేదని పెట్రాంచెలక స్టేజీ గ్రామస్తుల మండిపాటు

ఇల్లెందు, ఫిబ్రవరి 13: బొగ్గు రవాణా చేసే లారీల నుంచి పెళ్లలు కిందపడుతూ, వెదజల్లే దుమ్ము ధూళితో అనారోగ్యం బారిన పడుతున్నామని, కనీసం ఇళ్ల ముందు కూర్చోలేకపోతున్నామని టేకులపల్లి మండలం పెట్రాంచెలక స్టేజీ గ్రామస్తులు రోడ్డుకు అడ్డంగా కర్రలు, రాళ్లు పెట్టి గురువారం మూడు గంటలకుపైగా నిరసన తెలిపారు. గురువారం ఉదయం నుంచి కోయగూడెం ఉపరితల గని నుంచి బొగ్గు రవాణా చేస్తున్న టిప్పర్లు, లారీలు, డ్యూటీకి వెళ్తున్న సింగరేణి అధికారుల వాహనాలను అడ్డుకొని నిరసన తెలిపారు. ఈ సందర్భంగా పలువురు గ్రామస్తులు మాట్లాడుతూ నిత్యం బొగ్గు లారీలు, టిప్పర్లు తిరగడం వల్ల రోడ్లు గుంతలమయం అవుతున్నారని, దుమ్మూధూళి ఇళ్లలోకి చేరి శ్వాస సంబంధిత వ్యాధులతో ఇబ్బంది పడుతున్నామని, ఆసుపత్రుల చుట్టూ తిరుగుతున్నామని ఆవేదన వ్యక్తం చేశారు. లాభాల్లో నడుస్తున్న సింగరేణి యాజమాన్యం ఓసీ ప్రభావిత గ్రామాల్లో ప్రజల కోసం కనీసం సేవా కార్యక్రమాలు చేపట్టడం లేదని వాపోయారు. కాగా.. ఘటనా స్థలానికి చేరుకున్న సింగరేణి అధికారి అంజిరెడ్డి, బోడు ఎస్సై పొడిశెట్టి శ్రీకాంత్‌లు సింగరేణి అధికారులతో చర్చలకు రావాలని నచ్చజెప్పి ఆందోళన విరమింపజేశారు. అనంతరం పలు సమస్యలతో కూడిన వినతిపత్రాన్ని సింగరేణి అధికారులకు అందజేశారు.



టేకులపల్లి మండలం పెట్రాంచెలక స్టేజీ వద్ద రోడ్డుపై కర్రలు, రాళ్లు పెట్టి నిరసన వ్యక్తం చేస్తున్న గ్రామస్తులు

## ఎమ్మెల్సీ ఎన్నికల బరిలో 19 మంది

- ముగ్గురు అభ్యర్థుల ఉపసంహరణ
- ఈ నెల 27న ఎన్నికలు.. వచ్చే నెల 3న కౌంటింగ్
- 12 జిల్లాల్లో 25,797 మంది ఓటర్లు: నల్లగొండ కలెక్టర్ త్రిపాఠి

నల్లగొండ, ఫిబ్రవరి 13: వరంగల్–ఖమ్మం–నల్లగొండ ఉపాధ్యాయ శాసన మండలి ఎన్నికల నేపథ్యంలో మొత్తం 23 మంది అభ్యర్థులు నామినేషన్లు వేయగా.. చివరికి 19 మంది అభ్యర్థులు బరిలో నిలిచారు. ఈ నెల 11న ఎన్నికల యంత్రాంగం చేపట్టిన స్క్రూట్నీలో తండు ఉపేందర్ అనే అభ్యర్థి తన నామినేషన్ పత్రంపై సంతకం పెట్టకపోవడంతో స్క్రూట్నీలో ఎగిరిపోగా.. గురువారం కోమటిరెడ్డి గోపాల్‌రెడ్డి, గంగిరెడ్డి కోటిరెడ్డి, బండ నాగరాజులు ఉపసంహరించుకున్న నేపథ్యంలో చివరికి 19 మంది బరిలో ఉన్నట్లు కలెక్టర్, ఆర్వో ఇలా త్రిపాఠి ప్రకటించారు. ఈ నెల 3వ తేదీన ఎస్ఈసీ ఎమ్మెల్సీ ఎన్నికలకు సంబంధించి నోటిఫికేషన్ విడుదల చేయగా.. నాటి నుంచి 10 వరకు నామినేషన్లు స్వీకరించారు. మొత్తం 23 మంది అభ్యర్థులు నామినేషన్లు వేయగా.. స్క్రూట్నీ, ఉపసంహరణ అనంతరం 19 మంది బరిలో ఉన్నారు. బరిలో ఉన్న వారిలో పులి సరోత్తమ్‌రెడ్డి(బీజేపీ), లింగిడి వెంకటేశ్వర్లు(ప్రజావాణి పార్టీ), అర్వ స్వాతి(స్వతంత్ర), అలుగుబెల్లి నర్సిరెడ్డి(స్వతంత్ర), కంటె సాయన్న(స్వతంత్ర), డాక్టర్ కొలిపాక వెంకటస్వామి(స్వతంత్ర), గాల్‌రెడ్డి హర్షవర్ధన్‌రెడ్డి (స్వతంత్ర), పన్నాల గోపాల్‌రెడ్డి(స్వతంత్ర), ఏలె చంద్రమోహన్(స్వతంత్ర), చాలిక చంద్రశేఖర్(స్వతంత్ర), జంగిటి కైలాసం(స్వతంత్ర), జెట్టి శంకర్(స్వతంత్ర), తలకోల పురుషోత్తంరెడ్డి(స్వతంత్ర), తాటికొండ వెంకటరాజయ్య(స్వతంత్ర), దామెర బాబురావు(స్వతంత్ర), పింగిలి శ్రీపాల్‌రెడ్డి(స్వతంత్ర), పూల రవీందర్(స్వతంత్ర), బంక రాజు(స్వతంత్ర), ఎస్.సుందర్‌రాజు(స్వతంత్ర)లు బరిలో ఉన్నారు. అయితే ఉమ్మడి నల్లగొండ, ఖమ్మం, వరంగల్ జిల్లాల్లో ఈ ఎన్నికలు నిర్వహించనున్నది. అయితే కొత్తగా ఏర్పడిన 12 జిల్లాల్లో మొత్తం ఓటర్లు 25,797 మంది ఉండగా.. సిద్దిపేటలో 166 మంది, జనగామ 1,002, హనుమకొండ 5,215, వరంగల్ 2,352, మహబూబాబాద్ 1,663, భూపాలపల్లి 329, ములుగు 628, భద్రాద్రి కొత్తగూడెం 2,022, ఖమ్మం 4,089, యాదాద్రి భువనగిరి 984, సూర్యాపేటలో 2,664 మంది ఓటర్లు ఉండగా.. నల్లగొండలో 4,683 మంది ఉన్నారు. వీరిలో పురుషులు 15,783 మంది ఉండగా.. స్త్రీలు 10,314 మంది ఉన్నారు. వీరు ఓటు హక్కును వినియోగించుకోవటానికి 200 పోలింగ్ స్టేషన్లు ఏర్పాటు చేసినట్లు ఆర్వో ఇలా త్రిపాఠి తెలిపారు.



మాట్లాడుతున్న నల్లగొండ కలెక్టర్ ఇలా త్రిపాఠి

### ఎన్నికల నియమావళి పాటించాలి: కలెక్టర్

వరంగల్–ఖమ్మం–నల్లగొండ ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల బరిలో ఉన్న అభ్యర్థులు ఎన్నికల ప్రవర్తనా నియమావళిని తప్పనిసరిగా పాటించాలని కలెక్టర్ ఇలా త్రిపాఠి సూచించారు. ఆమె గురువారం నామినేషన్ల ఉపసంహరణ అనంతరం ఎన్నికల బరిలో ఉన్న అభ్యర్థులు, వారి ఏజెంట్లతో నిర్వహించిన సమావేశంలో మాట్లాడారు. పోటీలో ఉన్న అభ్యర్థులు పాఠశాల సమయాల్లో ప్రచారం చేయడం నిషేధమని, అనుమతి ఆయా జిల్లాల ఎన్నికల అధికారులతో తీసుకోవచ్చని, మొత్తం నియోజకవర్గ అనుమతులు నల్లగొండ డీఆర్వో ద్వారా తీసుకోవాలని అన్నారు. పోలింగ్, కౌంటింగ్ ఏజెంట్ల నియామకానికి ఫొటోలు పంపించాలని సూచించిన ఆమె ఈ నెల 10న ప్రచురించిన ఓటరు జాబితా ప్రకారం 25,797 మంది ఓటర్లు ఉన్నట్లు తెలిపారు. నల్లగొండలోని ఆర్జాలబావి ఎస్‌డబ్ల్యూసీ గోదాములో ఓట్ల లెక్కింపు ప్రక్రియ ఉంటుందన్నారు. కౌంటింగ్ సందర్భంగా 25 టేబుల్స్ ఏర్పాటు చేస్తున్నామని, ప్రతి టేబుల్‌కు ఒక ఏజెంటును నియమించుకోవచ్చన్నారు. అనంతరం ఎస్పీ శరత్ చంద్రపవార్ మాట్లాడుతూ అభ్యర్థులు ర్యాలీలు, సమావేశాలు, వాహనాల కోసం ముందస్తు అనుమతి తీసుకోవాలన్నారు. ఎన్నికల ఏజెంట్లకు నేర చరిత్ర ఉండొద్దని, లైసెన్స్ ఆయుధాలు ఉన్నట్లైతే డిపాజిట్ చేయాలన్నారు. ప్రచారం ఉదయం 6 నుంచి రాత్రి 10 గంటల వరకు మాత్రమే చేసుకోవాలని, కౌంటింగ్ సందర్భంగా మూడంచెల భద్రత ఉంటుందని, సీసీ కెమెరాల నిఘాలో భద్రత పర్యవేక్షణ ఉంటుందన్నారు. సమావేశంలో అదనపు కలెక్టర్ శ్రీనివాస్ పాల్గొన్నారు.

## ఎలుకలు కొరికినా బయటకు చెప్పొద్దు

- ఇద్దరు విద్యార్థినులను హెచ్చరించిన అధికారులు
- చంద్రుగొండ కేజీబీవీలో ఆలస్యంగా వెలుగు చూసిన ఘటన

చంద్రుగొండ, ఫిబ్రవరి 13: ఇద్దరు విద్యార్థినులకు ఎలుకలు కరిచినా విషయాన్ని బయటకు చెప్పొద్దని అధికారులు హెచ్చరించిన ఘటన చంద్రుగొండ కేజీబీవీలో గురువారం ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. వివరాలు ఇలా ఉన్నాయి. కేజీబీవీ హాస్టల్‌లో ఈ నెల 11(మంగళవారం) రాత్రి విద్యార్థినులు నిద్రిస్తున్న సమయంలో పదో తరగతి చదువుతున్న కాకటి స్వశ్చిత, కాకటి గోపికల కాళ్లను ఎలుకలు కరిచాయి. ఈ విషయాన్ని బుధవారం కేజీబీవీ స్పెషలాఫీసర్ కవిత దృష్టికి తీసుకెళ్లారు. దీంతో ఆమె వారిద్దరికీ ప్రభుత్వ ఆసుపత్రిలో చికిత్స చేయించారు. అంతేకాక ఈ విషయాన్ని బయట ఎక్కడా చెప్పొద్దని ఆ విద్యార్థినులను హాస్టల్ అధికారులు హెచ్చరించారు. ఈ విషయం ఎలాగోలా వారి తల్లిదండ్రుల ద్వారా ఎంఈవో సత్యనారాయణకు గురువారం తెలిసింది. దీంతో ఆయన కేజీబీవీ హాస్టల్‌ను తనిఖీ చేశారు. ఎలుకలు కరవడంతో గాయపడిన ఇద్దరు విద్యార్థినులను పరామర్శించారు. హాస్టల్‌లో ఎలుకలను అరికట్టడానికి ర్యాట్ గమ్‌ప్యాడ్‌లను వాడాలని స్పెషలాఫీసర్‌ను ఆదేశించారు. ఇలాంటి సమస్య మళ్లీ పునరావృతం కాకుండా చూసుకోవాలని ఆదేశాలు జారీ చేశారు. కాగా.. హాస్టల్ అధికారుల నిర్లక్ష్యంపై తల్లిదండ్రులు, విద్యార్థి సంఘాలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.



కాలికి ఎలుకలు కరిచిన చోటును చూపిస్తున్న విద్యార్థినులు